క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ఎస్ఎస్‌తాడ్వాయి: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కానిస్టేబుళ్లు సాంబయ్య, వెంకటేశ్వర్లు, రవీందర్‌లు సూచించారు. ఈ మేరకు మండల కేంద్రానికి శనివారం వివిధ గ్రామాల నుంచి పనుల నిమిత్తం వచ్చిన వారికి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌కు ఓటీపీలు వస్తే ఎవరికీ చెప్పొద్దని, సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని అన్నారు. బ్యాంక్ ఖాతా వివరాలు, ఆధార్, ఓటీపీ వివరాలు చెప్పాలని బ్యాంక్ అధికారులమంటూ ఫోన్ చేస్తే స్పందించవద్దని సూచించారు. ఆన్‌లైన్ లావాదేవిలు నిర్వహించే వారు తెలియని మెస్సేజ్‌లను డెలిట్ చేయాలన్నారు. అపరిచితుల వ్యక్తుల మాటలను నమ్మొద్దని, వారికి ఎలాంటి వివరాలు చెప్పొద్దన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



ములుగు: జిల్లా కేంద్రంలోని డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నేడు(ఆదివారం) నిర్వహించతల పెట్టిన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కన్వీనర్ ఎండీ షఫీ అహ్మద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని డీపీఆర్వో కార్యాలయం ఎదుట శనివారం ప్రథమ మహాసభ వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. జిల్లాలోని ఆయా మండలాల యూనియన్ సభ్యులు విధిగా హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గుర్రం శ్రీధర్, జాలిగం శ్రీనివాస్, భూక్య సునీల్, బైకాని నటరాజ్, జినుకల ప్రభాకర్, చుంచు రమేశ్, ఎనగందుల కొమురయ్య, సుమన్, శరత్, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



ములుగు రూరల్: గోవిందరావుపేట మండల కేంద్రానికి చెందిన పత్తిరి రాజు, పస్రా గ్రామానికి చెందిన బద్దం భారతమ్మ , కొల్లు మల్లారెడ్డిలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే సీతక్క శనివారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు పార్టీ పరంగా ఉండగా ఉంటానని సీతక్క భరోసా కల్పించారు. ఎమ్మెల్యే వెంట ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్, దాసరి సుధాకర్, మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, పార్వతి, సృజన, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్, సోమయ్య, కల్యాణి, ఉమాదేవి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తం..



వాజేడు: గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు గోదావరిలో వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో వైద్యాధికారులు అప్రమత్తం అయ్యారు. ముందస్తు చర్యల్లో భాగంగా మండలంలోని ముగ్గురు గర్భిణులను ఏటూరు నాగారం సివిల్ ఆస్పత్రికి తరలించారు. మండలంలోని టేకులగూడెంకు చెందిన ధన, ధర్మవరం గ్రామానికి చెందిన నాగ జ్యోతి, స్వప్నలను అంబులెన్స్‌లో తీసుకెళ్లారు. వైద్య సేవలకు అందుబాటులో ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ రాహుల్‌చంద్రవర్మ, ఆర్ఐ రాజు, ఆశాలు, ఏఎన్ఎంలు వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు.

పట్టణానికి చేరుకున్న సంకల్ప యాత్ర

భూపాలపల్లి అర్బన్: సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న పాత పెన్షన్ సాధన సంకల్పయాత్ర శనివారం సాయంత్రం భూపాలపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని జయశంకర్, అంబేడ్కర్ చిత్రపటాలను పూలమాల వేసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. 2004 సంవత్సరంలో అమలులోకి వచ్చిన సీపీఎస్‌ను రద్దు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. సీపీఎస్ రద్దు చేసేంత వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటలు మర్చిపోతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు దిల్షాద్, శివకృష్ణ, సుభాకర్‌రెడ్డి, కృష్ణమూర్తి, లక్ష్మయ్య, రఘు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి పోయేకాలం వచ్చింది

- జీపీ కార్మికులపై వివక్ష సరికాదు
- వీధులు కంపుకొడుతున్నా మొద్దునిద్ర వీడరా?
- మండిపడిన ఎమ్మెల్యే సీతక్క



ములుగు రూరల్: గోవిందరావుపేటలో పంచాయతీ కార్మికుల సమ్మెలో మాట్లాడుతున్న సీతక్క

ములుగు రూరల్: కార్మికుల హక్కులను హరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి పోయే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క ధ్వజమెత్తారు. గత 17 రోజులుగా పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తుంటే సీఎం కేసీఆర్ మొద్దునిద్ర వీడడం లేదని విమర్శించారు. శనివారం గోవిందరావుపేట మండల కేంద్రంలో పంచాయతీ కార్మికుల చేపడుతున్న నిరవధిక సమ్మెకు ఆమె మద్దతు తెలిపి సమ్మెలో కూర్చున్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ కార్మికుల శ్రమను ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. అసెంబ్లీలో వాగ్దానాలు చేసిన సీఎం కేసీఆర్ వాటిని అమలు చేయడంలో విఫలమయ్యారని అన్నారు. పంచాయతీ కార్మికులు, సిబ్బంది సమ్మెకు దిగడంతో గ్రామాల్లో పారిశుధ్యం పడకేసిందన్నారు. వర్షాల కారణంగా వీధులు చెత్తా, చెదారంలో కంపు కొడుతున్నాయని అన్నారు. అర్హులైన కారోబార్‌లకు సహాయ పంచాయితీ కార్యదర్శులుగా నియమించాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికులకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని అన్నారు. జీపీ కార్మికులు న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ వారికి పూర్తి మద్దతు ప్రకటిస్తూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్, దాసరి సుధాకర్, మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ పార్వతి, సృజన, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్, సోమయ్య, కళ్యాణి, ఉమాదేవి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వాజేడు: మోకాళ్లపై నిరసన తెలుపుతున్న జీపీ కార్మికులు



వెంకటాపురం(కె): భిక్షాటన చేస్తున్న కార్మికులు

వెంకటాపురం(కె)లో..

వెంకటాపురం(కె) : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారంతో 17వ రోజుకు చేరుకుంది. ఈ సదర్భంగా పంచాయతీ కార్మికులు మండల కేంద్రంలో ప్రతీ ఇంటికీ వెళ్లి భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కట్ల నర్సింహచారి, పంచాయతీ కార్మికులు రంజిత్, తాటి శ్రీను, దేవరకొండ లక్ష్మణరావు, సమ్మయ్య, బుచ్చిబాబు, అనూష తదితరులు ఉన్నారు.

వాజేడులో..

వాజేడు: న్యాయమైన డిమాండ్లతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం 17వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులు మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ప్రభుత్వం తమకు జీవో 60 ద్వారా వేతనాలు చెల్లించాలని, కారోబార్‌లను సహాయక కార్యదర్శులుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. వెంటనే స్పందించాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అదనపు పేర్లు రాసి.. డబ్బులు డ్రా ?



ఏటూరునాగారం పంచాయతీ కార్యాలయం

ఏటూరునాగారం: ఏటూరునాగారం మేజర్ గ్రామ పంచాయతీలో ప్రైవేటు లేబర్ ద్వారా పనులు చేయిస్తుండగా అదనంగా మరో కొంత మంది పేర్లను జాబితాలో పొందుపరిచి బిల్లులు డ్రా చేస్తున్నట్లు సమాచారం. గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తుండడంతో చెత్తా, చెదారం తొలగించడానికి ప్రైవేటు లేబర్‌ను కమలాపురం నుంచి తీసుకొస్తున్నారు. ఇలా 25 మంది ప్రైవేటు లేబర్ పనిచేస్తే 35 మందితో పనులు చేయించినట్లు రికార్డులు రాసి బిల్లులు తీసుకుంటున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవల గ్రామ పంచాయతీ పరిధిలోని బాలకార్మికుడితో పనులు చేపిస్తుండగా కేసు నమోదు అయ్యింది. ఈ విషయంపై విచారణ చేపట్టిన ఐసీపీఎస్ అధికారులు గ్రామ పంచాయతీ వద్ద లేబర్ పనులు చేసిన ప్రైవేటు పేర్ల జాబితా ఇవ్వమని కోరగా పంచాయతీ అధికారులు గోప్యంగా ఉంచడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రైవేటు లేబర్‌లో చిన్న వయస్సు ఉన్నవారు వచ్చినప్పటికీ గ్రామ పంచాయతీ అధికారులు, పాలకులు పట్టించుకోకుండా వారితో పనులు చేపించినట్లు సమాచారం. చిన్నారులతో పనులు చేపించి వయస్సు మళ్లిన వారు వచ్చినట్లుగా తప్పుడు రికార్డులు రాసినట్లుగా తెలుస్తోంది. ఈ విషయంపై గ్రామ పంచాయతీ కార్యదర్శిని అశోక్‌ను వివరణ కోరగా ప్రైవేటు లేబర్‌కు మాత్రమే బిల్లులు చేసి డబ్బులు ఇచ్చామని తెలిపారు. అధనంగా పేర్లు రాయలేదని వివరించారు. బాలకార్మికుడి విషయం జరిగిన నాటి నుంచి లేబర్ రావడం లేదన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి



ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఎస్సై ఒంకార్‌యాదవ్ అన్నారు. తాడ్వాయి నూతన ఎస్సై ఆయన బాధ్యతలు స్వీకరించగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు శనివారం మార్యదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల పరిస్థితులపై చర్చించారు. ప్రతీఒక్కరూ శాంతిభద్రతలకు, పోలీస్‌లకు సహకరించాలని ఆయన సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. గెట్టు పంచాయతీ, తదితర సమస్యలు నెలకొంటే నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చే విధంగా మండల ప్రజలకు తెలుపాలని, ప్రజలకు పోలీస్‌శాఖ అందుబాటులో ఉంటుందన్నారు. అనంతరం ఎస్సైను శాలువాతో ఘనంగా సన్మానించి పూల మొక్క అందించారు. మండల అధ్యక్షుడు దండుగల మల్లయ్య, ఏటూరునాగారం ఆత్మ చైర్మన్ దుర్గం రమణయ్య, ఏటూరునాగారం జీసీసీ డైరెక్టర్ పులుసం పరుషోత్తం, ఉపసర్పంచ్ ఇంద్రాసేనారెడ్డి, నాయకులు బండారి చంద్రయ్య, వసంతరావు, గుర్రం సమ్మిరెడ్డి, చల్లా రజినీకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, లింగాచారి, మహిపాల్‌రెడ్డి, సంజీవరెడ్డి, డ్యాగల సలేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



నూతనంగా ఎన్నికైన మండల కమిటీ

ఎస్ఎస్‌తాడ్వాయి: ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఉద్యమించిన తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పత్తి గోపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యమకారులను ప్రభుత్వం విస్మరించొద్దని అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆ సంఘం సమావేశం నిర్వహించగా మండల నూతన కమిటీ కార్యవర్గాన్ని ఎకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. మండల అధ్యక్షుడిగా మలిదశ ఉద్యమకారుడు డ్యాగల సలేందర్, సలహాదారులుగా దిడ్డి మోహన్‌రావు, ఆలేటి మహిపాల్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా ఆలేటి జైపాల్‌రెడ్డి ఉపాధ్యక్షులుగా చల్ల రజినీకర్‌రెడ్డి, సల్లూరి లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిగా పిన్నింటి సంజీవరెడ్డి, సహాయ కార్యదర్శులుగా రంగు సత్యనారాయణ, పిరీల చలమయ్య, ప్రచార కార్యదర్శిగా విజయ్, కోశాధికారిగా లొడారి మల్లెలరావు, కార్యవర్గ సభ్యులుగా చెవుగాని చిరంజీవి, డేగల సదయ్య, పోగు నగేష్, రామయ్య, కృష్ణ, మహేశ్వరచారిలను ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని ఊరట్టం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోటి నరసింహులు కుమారుడు జశ్వంత్ ఇటీవల కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే సీతక్క ఆదేశాల మేరకు బాధిత కుటుంబ సభ్యులకు రూ. 10వేల ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. అనంతరం జశ్వంత్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే సీతక్క, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ పులి సంపత్ గౌడ్, మండల గౌరవ అధ్యక్షుడు జాలపు అనంతరెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరిల వెంకన్న, సింగిల్ విండో డైరెక్టర్ యాశాడపు మల్లయ్య, నాయకులు వెంకట్రాంరెడ్డి, కొక్కెర పూర్ణ చందర్, వట్టం సమ్మయ్య, వెంకటేష్, మేడారం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్దబోయిన రమేష్, వట్టం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక ఆస్పత్రిలో రక్తదానం



సర్టిఫికెట్లు అందుకుంటున్న రక్తదాతలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రిలో గల బ్లడ్‌బ్యాంక్‌లో మండల కేంద్రానికి చెందిన నాయీబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు శనివారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు దడిగల నర్సింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచందర్, జిల్లా గౌరవ అధ్యక్షులు దడిగల సమ్మయ్యలు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్న వారికి రాక్తదానం చేయడం అదృష్టంగా భావించాలన్నారు. అలాగే ఆపదలో ఉన్న ఎందరికో రక్తదానం చేస్తున్న ఏటూరునాగారం బ్లడ్ డోనర్స్ సేవలను కొనియాడారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్‌లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో నాయిబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు దడిగల లక్ష్మణ్, సత్యం, మహేందర్, రాజారామ్, శ్రీరాములు, చంద్రశేఖర్, రాజు, శ్రీనివాస్, రాము, రమేష్, మల్లికార్జున్, రవి పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఎస్సైకి సన్మానం



ఎస్సై హరీష్‌ను సన్మానిస్తున్న నాయకులు

వాజేడు: మండలలంలోని పేరూరు ఎస్సైగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న రుద్రారపు హరీష్‌ను స్థానిక బీఆర్ఎస్ నాయకులు శనివారం సన్మానించారు. ఇంతకాలం మండల ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ సరస్వతి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సోమిడి నర్సింహరావు, ఆదినారాయణ, రజితతో పాటు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంధ్యా సమయం.. సాగరతీరం



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని జంపన్నవాగు సాయంత్రం సంధ్యవేళలో సోయగాలను కురిపిస్తోంది. సాయంత్రం వేళ సూర్యుడు అస్తమిస్తుండగా వాగుపై పడుతున్న కిరణాలతో నీళ్ల ముత్యంలా మెరుస్తున్నాయి. జాలర్లు పడవలతో కిరణాలను తాకుతూ ప్రయణించడం ఆహ్లాదాన్ని పంచుతుంది. చూసిన ప్రతీ ఒక్కరిని అబ్బురపరిచే దృశ్యాలను సాక్షి తమ కెమెరాలో బంధించింది.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

ఏటూరునాగారం: జిల్లాలోని కొత్త పోడు పట్టాదారులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏటూరునాగారం వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీధర్ కోరారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 జూన్ 18వరకు మంజూరైన పట్టాదార్ పాసు పుస్తకాలు అందుకున్న పోడు పట్టాదారులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. పట్టాదారుడి వయస్సు 18 నుంచి 59 మధ్యలో ఉండాలన్నారు. బీమా కోసం పట్టాపాస్ బుక్, పోడు పట్టా జిరాక్స్, ఆధార్ కార్డు, నామిని ఆధార్‌కార్డు తప్పనిసరిగా వ్యక్తిగతంగా వచ్చి వ్యవసాయశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఒక వేళ నామిని 18 సంవత్సరాల లోపు వారైతే వారికి తప్పనిసరిగా అప్పాంయింటీని నియమించుకోవాలని వారి ఆధార్ కార్డు కూడా తప్పనిసరిగా దరఖాస్తు సమయంలో సమర్పించాలన్నారు. వచ్చే నెల 5లోపు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు.

కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడుకుంటాం



ములుగు: కండువా కప్పి ఆహ్వానిస్తున్న సీతక్క

ములుగు : పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడుతకుంటామని ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో శనివారం బీఆర్ఎస్ పార్టీ నాయకుడు బొంతల వేణుయాదవ్ కాంగ్రెస్ పార్టీలో చేరగా సీతక్క కండువా కప్పి ఆహ్వానించారు. రాబోయే రోజులు కాంగ్రెస్ పార్టీవేనని, ప్రజలంతా కాంగ్రెస్‌తోనే ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో కొనసాగే కుటుంబ పాలనను గద్దెదించే రోజులు వస్తున్నాయని అన్నారు. బీఆర్ఎస్‌పార్టీ చేసే ద్రోహాలను ప్రజలు గుర్తిస్తున్నారని అన్నారు. జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, ఓంప్రకాష్, గుండబోయిన రమేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల ప్రజలను ఆదుకోవాలి

కన్నాయిగూడెం: మండలంలో కురుస్తునన వర్షాలకు ముంపు ప్రాంతాల ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఎమ్మెల్యే సీతక్క కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం ఆమె పర్యటించారు. సీతక్కకు కాంగ్రెస్ కార్యకర్తలు బైక్‌లతో స్వాగతం పలుకుతూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఏటూరు, చింతగూడెం, బుట్టాయిగూడెం, ముప్పనపల్లి వరకు ర్యాలీ చేపట్టారు. ముప్పనపల్లి గ్రామంలోని మహారాజు కాలనీలో రోడ్లు నిర్మించాలని కాలనీ వాసులు కోరారు. అనంతరం లక్ష్మిపురంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచి సుమారు 50 మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా వారికి సీతక్క కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. మండలంలో గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో మండలంలోని రోడ్లు, ఇళ్లు ధ్వసమయ్యాయని, తక్షణమే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అప్సర్ పాషా, ఎంపీపీ జనగం సమ్మక్క, జెడ్పీటీసీ కరన్‌చందుగాంధీ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకన్న, మండల ఇన్‌చార్జ్ రాంబాబు, వైస్ ఎంపీపీ భాస్కర్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ సునార్కని సాంబశివ, ఏటూరునాగారం మండల అధ్యక్షుడు చిటమట రఘు, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ తదితరుల పాల్గొన్నారు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



చంటి బిడ్డను పరీక్షిస్తున్న వైద్యాధికారిణి

వాజేడు: వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి జ్ఞానస అన్నారు. మండల పరిధిలోని మొరుమూరు కాలనీ, బొల్లారంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. అదే విధంగా పలువురి నుంచి రక్తనమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, ఈగలు, దోమల వలన రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ప్రతిఒక్కరూ వేడి ఆహార పదార్థాలు మాత్రమే తీసుకోవాలని, కాచి చాల్లార్చిన నీరు తాగాలని సూచించారు. బాలింతలు తగు జాగ్రలు పాటించాలని సూచించారు. గర్భిణులు, మధుమేహం వ్యాధిగ్రస్తులను, బాలింతలను, క్షయవ్యాధి గ్రస్తులను, బీపీ పేషెంట్‌లను పరీక్షించి మందులను అందించారు. ఇంటింటా సర్వే చేపట్టి పలు సూచనలు చేయడంతో పాటు జ్వర పీడితులను స్థానిక వైద్యశాలకు పంపించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీలను శుభ్రం చేయాలి



పనులను పరిశీలిస్తున్న డీపీఓ వెంకయ్య

ములుగు రూరల్: వర్షాకాలంలో డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తా, చెదారాన్ని శుభ్రం చేయాలని డీపీఓ వెంకయ్య సూచించారు. ఈ మేరకు జంగాలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో చేపడుతున్న డ్రైనేజీ క్లినింగ్ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వరదనీరు రోడ్డుపై ఆగకుండా చర్యలు చేపట్టాలన్నారు. తాత్కలిక కార్మికులతో చేపడుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పంచాయితీ కార్యదర్శి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు పోడు పట్టాలివ్వాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె) ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ శనివారం ఆదివాసీ మండల పరిషత్ ఆధ్వర్యంలో తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పూనెం రామచందర్ మాట్లాడారు. 2005 అటవీ హక్కుల చట్టం ప్రకారం ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలివ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏజెన్సీలో ప్రాంతంలో ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ , తుడుందెబ్బ జిల్లా నాయకులు చిరంజీవి, నాయకులు కృష్ణబాబు, సున్నం సూరిబాబు, దనిశెట్టి శ్రీలత, చందర్‌రావుతో పాటు ఆ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై వెంటనే చర్య తీసుకోవాలి



ధ్వంసం చేసిన కట్టను పరిశీలిస్తున్న రైతులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని నార్లాపూర్ గ్రామం శివారులో గల తక్కెళ్లపాడు చెరువు కాలువను, కట్టను ధ్వంసం చేసిన కుక్కల శ్రీనివాస్‌పై చర్య తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తక్కళ్లపాడు చెరువు కింద 750 ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. చేపల పెంపకం కోసం చెరువు కట్టను ధ్వంసం చేసి రోడ్డు ఏర్పాటు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ చిన్నక్క, ఉప సర్పంచ్ రతన్‌సింగ్‌లు కట్టను ధ్వంసం చేసిన రైతును పలిపించి మాట్లాడిన ఫలితం లేదన్నారు. తాను ప్రజాప్రతినిధినని, ఎవరు ఏమీ చేయలేరని సదురు వ్యక్తి మాట్లాడడం, అధికారులు సైతం చూసిచూడనట్లు వ్యహరించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఈ విషయంపై కలెక్టర్, తహసీల్దార్, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులకు సమాచారం అందించగా స్థానిక వర్క్ ఇన్స్‌పెక్టర్ రవి ధ్వంసం చేసిన కట్టను పరిశీలించినట్లు తెలిపారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు లాల్ సింగ్, ధరావత్ మోహన్, నూనావత్ కోటి, వీరయ్య, ఎనగంటి భద్రయ్య, ఎనగంటి లక్ష్మయ్య, సమ్మయ్య, మొక్క నరేందర్, సిద్దబోయిన శివరాజు, బైకాని రాజకుమార్, వీరయ్య, రాజేందర్‌రెడ్డి, గోపి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సర్వే

ఏటూరునాగారం: వర్షాలు కురుస్తుండడంతో వైద్యాధికారులకు అప్రమత్తమయ్యారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు వైద్యాధికారి చాముండేశ్వరి తెలిపారు. మండల కేంద్రంలోని 3 వార్డులో శనివారం వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. వైద్యసిబ్బంది ఇంటింటా సర్వేలు చేస్తూ జ్వరపీడితులను గుర్తిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. వర్షాకాలం దృష్ట్యా ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలని సూచించారు. చల్లటి పధార్థాలు కాకుండా వేడి పదార్థాలను మాత్రమే తినాలని అన్నారు. ఎలాంటి అనారోగ్య సమస్య వచ్చని వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు.